సాక్షి ప్రకాశం

సోమవారం । 6 । మే । 2024



మీ ఆశీర్వాదంతో విజయం సాధిస్తాం

బ్రాహ్మణుల ఆశీర్వాదంతో ఒంగోలు ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులుగా ఘన విజయం సాధిస్తామని బాలినేని అన్నారు. - 8లో..



శ్రీశైలం ఘాట్ రోడ్డులో ప్రమాదం

శ్రీశైలం ఘాట్ రోడ్డులో ఎదురుగా వచ్చిన రెండు ఆర్టీసీ బస్సులు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతిచెందగా 8 మందికి గాయాలయ్యాయి. - 8లో..



వాతావరణం

ఎండ తీవ్రత పెరుగుతుంది. వాతావరణం ఉక్కపోతగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అమలులో లేదు

- మారెడ్డి సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ఒంగోలు సెంట్రల్: ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ మన రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయటం లేదని, కేవలం ప్రతిపక్ష కూటమి నాయకులు రాజకీయ దురుద్దేశంతో దుష్ప్రచారం చేస్తున్నారని వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారెడ్డి సుబ్బారెడ్డి అన్నారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అన్ని రాష్ట్రాల్లో దీనిని అమలు చేయాలంటూ బీజేపీ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. బీజేపీ ప్రభుత్వం మన రాష్ట్రంపై ఒత్తిడి తీసుకొస్తున్నా.. నిరంతరం రైతుల సంక్షేమాన్ని కాంక్షించే సీఎం వైఎస్ జగన్ అంగీకరించలేదన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ప్రస్తుతం న్యాయస్థానం పరిధిలో ఉందన్నారు. దీనిని అమలు చేయని విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోర్టుకు ఇప్పటికే అఫిడవిట్ సమర్పించిందని చెప్పారు. ప్రస్తుతం ఈ యాక్ట్‌ను రాష్ట్ర ప్రభుత్వం 'కేప్ట్ ఇన్ పెండింగ్' పెట్టిందన్నారు. కార్డు- 2 వెర్షన్ అప్‌డేషన్‌లో భాగంగా ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఒక మోమోను జారీ చేసిందన్నారు. దాని ప్రకారం 16 సబ్ రిజిస్టర్ కార్యాలయాల్లో 135 డాక్యుమెంట్లను ఒక డమ్మీ సాఫ్ట్‌వేర్ ద్వారా ప్రయోగాత్మకంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టారన్నారు. దీని అమల్లో లోపాలను తెలుసుకునేందుకు కేవలం డమ్మీ సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి పరిచారన్నారు. దీన్ని కూడా ప్రతిపక్ష నాయకులు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌కు ముడిపెట్టి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. దీనిపై ఫేక్ వీడియోలు సృష్టించి ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తూ ప్రజలను భయ భ్రాంతులకు గురి చేస్తున్నారని అన్నారు. రైతులు ఈ విషయాలను గమనించాలన్నారు.

రెండో రోజు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

ఒంగోలు అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఎన్నికల విధుల్లో ఉండే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ శనివారం ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఆదివారం రెండో రోజు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ జరిగింది. ఓటింగ్ ప్రక్రియను ఎన్నికల సాధారణ పరిశీలకుడు అరవింద్ కుమార్ చౌరాసియా పరిశీలించారు.

దామా.. అంతా డ్రామా

జనం చిత్రవధ

కుట్రలూ..కుతంత్రాలకు కేరాఫ్ అడ్రస్ తెలుగుదేశం పార్టీ. ఆ పార్టీ అధ్యక్షుడి దగ్గర నుంచి కింది స్థాయి నేతల వరకూ అదేతీరు. మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఒంగోలు అభివృద్ధికి అడుగడుగునా అడ్డంకులు సృష్టించారు. అధికారాన్ని అడ్డంపెట్టుకుని ప్రజల్ని ఇబ్బందులకు గురిచేశారు. పార్టీ అధినేత చంద్రబాబు మెప్పు కోసం ఊరచెరువు ప్రాంతంలోని ముస్లింలపై ప్రతాపాన్ని చూపారు. నగరంలో పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి చేస్తున్న ప్రయత్నాలకు అడుగడుగునా న్యాయపరమైన అవరోధాలు కల్పించారు. ఎన్నికలప్పుడు హామీలు ఇవ్వడం ఆ తర్వాత మొండిచేయి చూపడం ఆయనకు అలవాటే.

- ఒంగోలు అభివృద్ధికి అడ్డంకిగా దామచర్ల
- అధినేత మెప్పు కోసం ముస్లింలపై దాష్టీకం
- పేదల ఇళ్లపై అక్కసు
- నాడు న్యాయపరమైన అడ్డంకులు సృష్టించి
- నేడు సీఎం ఇచ్చిన పట్టాలపై అసత్య ప్రచారం
- తనవారి కోసం పేదలపై కేసులు
- నాడు జెడ్పీ పీఠం కైవసానికి కుట్రలు
- తిప్పికొట్టిన బాలినేని, ఆదిమూలపు



ఒంగోలు సాక్షిప్రతినిధి: తెలుగుదేశ ప్రభుత్వ హయాంలో ఒంగోలు నియోజకవర్గ ప్రజలకు తీవ్ర అన్యాయం జరిగింది. ఆ పార్టీ నేత, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్థన్ వ్యవహార శైలితో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అధికారాన్ని అడ్డంపెట్టుకుని ఆయన పాల్పడిన అక్రమాలు ఎన్నో ఉన్నాయి. పుష్కరకాలంగా దామచర్ల కుట్రలు, కుతంత్రాలకు సాక్ష్యంగా పలు సంఘటనలు నిలుస్తున్నాయి. ఆయన సొంత సామాజిక వర్గం నేతల్ని మినహా మిగతవారందరినీ అవసరాలకు తగ్గట్టుగా వాడుకుని వదిలేస్తారన్నది బహిరంగ రహస్యం. 2012 సంవత్సరంలో జరిగిన ఉపఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా దామచర్ల పోటీకి దిగారు. ఆ నాటి నుంచి నేటి వరకూ నగరంలో జరిగిన సంఘటనల్లో ప్రధానమైనవి పరిశీలిస్తే నియోజకవర్గానికి ఎంత నష్టం జరిగిందో అవగతమవుతుంది.

☛ 2012 ఉప ఎన్నికల సమయంలో 9వ డివిజన్ ఇందిరమ్మ కాలనీలో సొంతంగా మినరల్ వాటర్ ప్లాంటు పెడుతున్నట్లు డ్రామా ఆడారు. వైఎస్సార్ ప్రభుత్వంలో కేటాయించిన నివాస ప్లాట్లలో ఏర్పాటు చేస్తున్నట్లు హడావుడి చేశారు. అది కూడా ఎన్నికల కోడ్ అమలులో ఉండగా. దీంతో అప్పట్లో అభ్యంతరాలు వ్యక్తం కావడంతో నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. అధికారంలోకి రాగానే మినరల్ వాటర్ ప్లాంటు పెడతామని హామీ ఇచ్చారు. కానీ నేటికీ అక్కడ మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటు కాలేదు.

☛ ఏడుగుండ్లపాడు నుంచి ఒంగోలుకు మంచినీటి పైపులైను నిర్మాణానికి కేంద్రం నిధులు మంజూరు చేసింది. సమయంలో ప్రైవేటు స్థల యజమానికి పరిహారం ఇవ్వకుండా ఇష్టారీతిన వ్యవహరించడంతో పనులు నిలిచిపోయాయి. మరో వైపు నగరపాలక సంస్థ రూ.70 కోట్లు భాగస్వామ్యంగా వ్యయం చేయాల్సి ఉంది. అయితే కేంద్రం విడుదల చేసిన నిధులను ఖర్చుచేసి కమీషన్లు కొట్టేశారనే ఆరోపణలు ఉన్నాయి.

☛ నగరంలో రెండో కేంద్రీయ విద్యాలయం అవసరం ఉందని అప్పట్లో ఎంపీ వైవీ సుబ్బారెడ్డి చేసిన విజ్ఞప్తికి కేంద్ర మానవవనరుల శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. స్థానిక ప్రభుత్వ భవనాల సముదాయంలో రూములు కూడా తాత్కాలికంగా కేటాయించారు. సొంత భవనం నిర్మాణం కోసం స్థానిక జవహర్ నవోదయ విద్యాలయానికి సంబంధించి శిథిలమైన క్వార్టర్లు ఉండే భాగాన్ని ఎంపిక చేశారు. కానీ ఆ స్థలాన్ని కేటాయిస్తే వైఎస్సార్ సీపీకి మంచి పేరువస్తుందని కుట్రలు పన్ని అడ్డుకున్నారు దామచర్ల.

☛ రాష్ట్రవ్యాప్తంగా మంచినీటి వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని టీడీపీ ప్రభుత్వం సూచించింది. అందుకుగాను ఎన్టీయార్ సుజల పథకం అని నామకరణం చేశారు. అందులో భాగంగా ఒంగోలులో కూడా కేశవరాజుకుంటలో ఒక నివేశన స్థలంలో ప్లాంటు అయితే ఏర్పాటు చేశారు కానీ చుక్క నీరు కూడా విడుదల చేయలేదు. పేరుకు మాత్రం 20 లీటర్ల నీరు రూ.2లకే అని పేర్కొన్నారు. అందులోనూ తిరకాసే. ఖర్చు దాతలది...ప్రచారం ప్రభుత్వానికి కావడంతో దాతలు ముందుకు రాలేదు.

☛ ప్రస్తుత మినీ స్టేడియం పక్కన ఉన్న జెడ్పీ ప్రాంగణాన్ని టీడీపీ కార్యాలయం కోసం కేటాయించాలంటూ జిల్లా పరిషత్ చైర్మన్ ఈదర హరిబాబుపై ఒత్తిడి తెచ్చారు. అయితే ఆయన అందుకు తిరస్కరించడంతో జైకా నిధులతో నిర్మిస్తున్న నాగార్జున సాగర్ ప్రాజెక్టు కార్యాలయంపై కన్ను పడింది. కార్యాలయ భవన నిర్మాణ పనులను అడ్డుకుని నానా యాగీ చేశారు. నేటికీ పునాది దశలోనే ఆ నిర్మాణం దర్శనమిస్తోంది.

☛ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర వ్యాప్తంగా పేదలకు ఉచితంగా స్థలమిచ్చి ఇళ్ల నిర్మాణాలు చేపట్టింది. అందులో భాగంగా యరజర్ల వద్ద 25 వేలమందికి ఇళ్లపట్టాలు ఇచ్చి శాటిలైట్ సిటీ నిర్మించాలని బాలినేని యత్నిస్తే దానిని కోర్టు కేసుల ద్వారా అడ్డంకులు సృష్టించి అడ్డుకున్నారు. పేదలకు ఎలాగైనా సొంతిళ్లు నిర్మించాలని బాలినేని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా అధికారులు పక్కాగా ప్రైవేటు స్థలాలను కొనుగోలు చేశారు. సీఎం చేతుల మీదుగా ఇళ్ల పట్టాలు ఇస్తే అవి దొంగపట్టాలంటూ తప్పుడు ప్రచారానికి తెరతీశారు. ఈ స్థలాలపై కూడా న్యాయపరమై ఇబ్బందులు కలిగించేందుకు యత్నిస్తూనే ఉన్నారు.

☛ సంతనూతలపాడు, కొప్పోలు చెరువులను సమ్మర్ స్టోరేజీ ట్యాంకులుగా ఏడాది కాలంలో నిర్మిస్తానని ఎంఎల్ఏగా గెలిచిన మొదటి పర్యటలోనే ప్రజలకు దామచర్ల హామీ ఇచ్చారు. కానీ ఆయన పదవీ కాలం పూర్తయ్యేనాటికి కూడా కనీసం వాటివైపు తొంగి చూసిన దాఖలాలు కూడా లేవు.

☛ స్థానిక బైపాస్‌లో విలువైన స్థలాన్ని పార్టీ కార్యాలయం కోసం ప్రభుత్వం వద్ద నుంచి లీజుకు తీసుకున్నారు. దాని ప్రకారం అందులో నిర్మాణం ప్రారంభించాల్సి ఉన్నా అది ప్రారంభం కాకపోవడంపై దాతలు దొరక్క అనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

☛ స్థానిక కేశవరాజు కుంటలో పెళ్లి కానుక పేరుతో ధనికులైన, తెల్లకార్డు కూడా లేని తెలుగుదేశం పార్టీ మహిళా నాయకురాళ్లకు ఎస్ఎస్‌పీ భూమికి నకిలీ పట్టాలు సృష్టించి మరీ అప్పగించిన చరిత్ర దామచర్లదే. చివరకు ఈ వ్యవహారంపై తిరగబడ్డ సమీప కాలనీవాసులైన మహిళలపై పెద్ద ఎత్తున కేసులు కూడా పెట్టించి పోలీసుస్టేషన్‌కు తీసుకువెళ్లిన ఘనత దామచర్లదే.

☛ దామచర్ల తన కార్యాలయంలో పనిచేసే వ్యక్తిని డ్రైవింగ్ లైసెన్స్, టూ వీలర్ కాగితాలు చూపించాలని ట్రాఫిక్ ఎస్సై మహేష్ కోరినందుకు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌నే ముట్టడించారు.

బాబు మెప్పుకోసం..

తొమ్మిది సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఒంగోలు ఊరచెరువుపై చంద్రబాబు కన్నుపడింది. ఆ స్థలంలో భువనేశ్వరి హాస్పిటాలిటీ సర్వీసెస్ పేరుతో ఆ భూమిని లీజుకు కేటాయించేందుకు యత్నాలు జరిగాయి. అప్పటి టీడీపీ మున్సిపల్ పాలకవర్గం అనుమతి కూడా ఇచ్చేసింది. అప్పటి కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు అడ్డుతగలడంతో అది కాస్తా ఆగింది. తిరిగి 2014లో మళ్లీ అధికారంలోకి వచ్చిన తరువాత చంద్రబాబు కన్ను మరోమారు ఆ ప్రాంతంపై పడింది. అధినేతను ప్రసన్నం చేసేందుకు దశాబ్దాలుగా ఊరచెరువు ఒడ్డున ఇనుపరేకులు, చెక్క వస్తువుల తయారీ దుకాణాలు ఏర్పాటు చేసుకుని పొట్టపోసుకుంటున్న ముస్లిం కుటుంబాలపై ప్రతాపాన్ని చూపారు దామచర్ల. రంజాన్ మాసం అని కూడా చూడకుండా వారి షాపులను కూల్చివేయించారు. దానిని హస్తగతం చేసుకోవాలని యత్నించినా బాలినేని ముస్లింలకు అండగా నిలిచారు. దీంతో నేటికీ వారి దుకాణాలు అక్కడే ఉన్నాయి. అధికారాన్ని అడ్డం పెట్టుకుని నాడు అరాచకాలకు పాల్పడి నేడు ఎన్నికలు సమయం వచ్చేసరికి ముస్లింలకు అండగా ఉంటానంటూ ప్రవచనాలు వల్లిస్తున్నారు.

జెడ్పీ పీఠంపైనా కుట్రే..

2014 సాధారణ ఎన్నికలకు కొద్ది ముందుగా జిల్లా ప్రజాపరిషత్‌కు ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు 31 ప్రాదేశికాలను కైవసం చేసుకుంటే టీడీపీ 25 సీట్లతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. దీంతో ముగ్గురు అభ్యర్థులను కొనుగోలు చేయడం ద్వారా, మరో వైఎస్సార్ సీపీ అభ్యర్థిని ఎన్నికకు హాజరుకాకుండా పోలీసుల అండగా యత్నించారు. బాలినేని శ్రీనివాసరెడ్డి, ఆదిమూలపు సురేష్ తదితరులు అడ్డుకట్ట వేశారు. అయితే ఈదర హరిబాబు జెడ్పీ చైర్మన్‌గా ఎంపిక కావడం ఇష్టంలేని దామచర్ల చివరకు ఆయనను జెడ్పీ చైర్మన్ స్థానంలో కొనసాగకుండా చేసేందుకు ఎంతోమందిపై ఎన్నోరకాలుగా ఒత్తిడి తీసుకొచ్చారు.

కాపులపైనా కేసులు

అధికారంలో ఉన్నప్పుడు కాపులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన జనార్దన్ నేడు జనసేన పొత్తు కలవడంతో కుల రాజకీయాలకు తెరతీశారు. నేతలను తమ వైపునకు తిప్పుకుంటే ఓట్లు వాటంతట అవే పడతాయనే భావనతో నేతలపై ఆకర్ష పథకాన్ని ప్రారంభించారు. నాడు కాపు సోదరునిపై గంజాయి కేసు పెట్టించారు. అంతే కాదు ముద్రగడపై టీడీపీ ప్రభుత్వ దమన కాండను నిరశిస్తూ కంచాలు మోగిస్తే దానిపై సైతం కేసులు పెట్టించిన విషయాన్ని కాపులు మర్చిపోలేదు. ఇలా అన్ని రకాలుగా నియోజకవర్గ ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన దామచర్లను జనం 'నిన్ను నమ్మం' బాబూ అంటున్నారు.

గెలిపించండి..మీ నమ్మకాన్ని నిలబెడతాం



మాట్లాడుతున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

- ఆర్యవైశ్యులకు బాలినేని శ్రీనివాసరెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి విజ్ఞప్తి
- గతంలో మిమ్మల్ని ఇబ్బంది పెట్టలేదు.. భవిష్యత్తులో ఇబ్బందులు రాకుండా చూసుకుంటానన్న బాలినేని
- ఆర్యవైశ్యుల ఇళ్లలోనే పెరిగాను..మీతో శభాష్ అనిపించుకుంటానన్న చెవిరెడ్డి
- పండుగలా జరిగిన ఆర్యవైశ్య ఆత్మీయ సమావేశం





కార్యక్రమానికి హాజరైన ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, ఆర్యవైశ్య సంఘ నాయకులు

ఒంగోలు టౌన్: ఎమ్మెల్యే, ఎంపీగా తమను గెలిపించండి, మీ నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అన్నారు. నగరంలోని ఏవన్ ఫంక్షన్ హాలులో ఆదివారం రాత్రి ఆర్యవైశ్య ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన సభలో బాలినేని మాట్లాడుతూ తెలుగుదేశం ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సభలో ఎప్పుడూ అబద్దాలు మాట్లాడే జనార్దన్ నేను ఆర్యవైశ్యులను ఇబ్బందులు పెట్టినట్లు చెప్పాడని, పాతికేళ్ల పాటు ఎమ్మెల్యేగా పనిచేశాను, ఏనాడూ ఆర్యవైశ్య వ్యాపారులను ఇబ్బందులు పెట్టలేదని అన్నారు. కరోనా లాంటి విపత్కర సమయాల్లో కూడా ఆర్యవైశ్యులు ప్రశాంతంగా వ్యాపారాలు చేసుకునేందుకు పూర్తిగా సహకరించానని తెలిపారు. అదే తెలుగుదేశం పార్టీ ఆర్యవైశ్యులకు ఏం చేసిందో చెప్పాలని ప్రశ్నించారు. నేను ఎలాంటి ఇబ్బందులు కలిగించినట్లు రుజువు చేస్తే ఇప్పుడే రాజీనామా చేసి పోతానని చెప్పారు. ల్యాండ్ టైటిలింగ్ చట్టం గురించి టీడీపీ లెక్కలేనన్ని అబద్ధాలను ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. మాజీ మంత్రి శిద్దా రాఘవరావుకు టీటీడీ చైర్మన్ గా చేయాలని కోరికగా ఉందని, ఆయనను టీటీడీ చైర్మన్‌ను చేసేంత వరకు ముఖ్యమంత్రితో పోరాడుతానని చెప్పారు. ప్రతి రెండేళ్లకోసారి ఒంగోలులో శ్రీనివాస కళ్యాణం జరిపిస్తానన్నారు. మీ కోసం ఏది చేయడానికైనా సిద్ధంగా ఉన్నాను, నన్ను, చెవిరెడ్డి భాస్కరరెడ్డిని గెలిపించండి, మీ రుణం తీర్చుకుంటాం అన్నారు.

ఆర్యవైశ్యుల ఇంట్లో పెరిగాను: చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

తాను చిన్నప్పుడు ఆర్యవైశ్యుల ఇంటిలోనే పెరిగానని, వారితోనే తిరిగానని ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆర్యవైశ్యులు నిజాయితీకి మారుపేరని, నమ్మకంగా ఉంటారని, అందుకే వారంటే తనకు ఎంతో గౌరవమని చెప్పారు. తన వ్యాపారాల విషయంలో ఆర్యవైశ్యులను నమ్ముతానని అన్నారు. ఆరో తరగతి నుంచి బీఈడీ దాకా 18 సంవత్సరాలు వెంకటేశ్వర స్వామి సన్నిధిలోనే చదువుకునే అదృష్టం లభించిందని చెప్పారు. టీటీడీ బోర్డులో పలు మార్లు సభ్యుడిగా పనిచేసే అవకాశం దేవుడు కల్పించారన్నారు. మీ సేవ చేయడానికే వెంకటేశ్వరస్వామి ఇక్కడికి నన్ను పంపించాడని భావిస్తున్నానని, ఎంపీగా గెలిపిస్తే మీ నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని హామీ ఇచ్చారు. ఐదేళ్లకోసారి వచ్చిపోయే రకం కాదని, మీ కుటుంబ సభ్యుడిగా, మీలో ఒకడిగా వ్యవహరిస్తానని అన్నారు. కష్టాల నుంచి పెరిగాను, కష్టాల విలువ బాగా తెలుసు, ప్రజల కష్టసుఖాల్లో అండగా ఉంటానని చెప్పారు. బాధ్యతగా, నిజాయతీగా పనిచేస్తాను, ఆశీర్వదించండి అని కోరారు. ఆర్యవైశ్యులంతా ఐక్యంగా కలిసి మెలిసి వైఎస్సార్ సీపీకి ఓట్లేయాలని, బాలినేని శ్రీనివాసరెడ్డి, చెవిరెడ్డి భాస్కరరెడ్డిలను గెలిపించాలని మాజీ మంత్రి శిద్దా రాఘవరావు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బాలినేని శచీదేవి, బాలినేని కావ్య, నగర మేయర్ గంగాడ సుజాత, కారంశెట్టి పుష్పలత, కుప్పం ప్రసన్న, ఆర్యవైశ్య నాయకులు మునగా కృష్ణారావు, కోడూరి సత్యనారాయణ, మట్టరాజ, తడపర్తి వాసు, తాతా మధు, రామస్వామి, శిద్దా హనుమంతరావు, సురేష్, ప్రవీణ్, సత్యం, వినోద్ ఆరె శ్రీను, ఆనంద్, కూరపాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాలినేని , పక్కన శిద్దా రాఘవరావు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఆత్మీయ సమావేశంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. చిన్నారులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు హైలెట్‌గా నిలిచాయి. ఆధ్యాత్మిక గీతాలు రంజింప చేశాయి. వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి చరిత్ర గురించి నిర్వహించిన క్విజ్ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. తొలుత వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మట్టి శివలింగానికి అభిషేకం చేశారు. ఈ కార్యక్రమాలకు హోస్టర్లుగా మృదుల, సుమన శ్రీ, మలక్ పేట శైలజ వ్యవహరించారు.

జగన్‌తోనే పారదర్శక పాలన

- వైఎస్సార్ సీపీ పాలనలో ప్రతి కుటుంబానికి సంక్షేమం
- మంచి చేసిన ప్రభుత్వానికి అండగా నిలవండి
- ఎన్నికల ప్రచారంలో మంత్రి ఆదిమూలపు సురేష్



నమూనా బ్యాలెట్ చూపిస్తూ మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్

కొండపి (సింగరాయకొండ): వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో పారదర్శక పాలన చేశారని..పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించారని.. మంత్రి, కొండపి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం సాయంత్రం మండలంలోని నేతివారిపాలెంలో రోడ్‌షో నిర్వహించారు. ముందుగా గ్రామ నాయకుడు దివి శ్రీనివాసులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల పాలనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేసిన సువర్ణ పాలనను గుర్తించి మరోసారి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. చంద్రబాబు ఎన్నికల మేనిఫెస్టోను చూసి మరోసారి మోసపోవద్దని కోరారు. ఎన్నికలు వచ్చినప్పుడే ఆయనకు ప్రజలు గుర్తుకు వస్తారని ఎద్దేవా చేశారు. ఆయన కథ ఏంటో 2014 లోనే ప్రజలకు తెలిసొచ్చిందన్నారు. ఆచరణ సాధ్యం కానీ హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక విస్మరించారన్నారు. రైతులు, పొదుపు మహిళల రుణాలు మాఫీ చేస్తానని చెప్పి వారిని మోసం చేసిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. మరోసారి ఆయన మాటలకు మోసపోవద్దని సూచించారు. 13వ తేదీ జరగబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి ఫ్యాన్ గుర్తు పై ఓటు వేసి గెలిపించాల్సిందిగా ఆయన కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఆరికట్ల కోటిలింగయ్య, జేసీఎస్ కన్వీనర్ గొట్టిపాటి మురళి, గ్రామ నాయకులు దివి శ్రీనివాసరావు, నన్నూరి శ్రీను, కొండయ్య, బొక్కిసం సుబ్బారావు, మారెడ్డి వెంకటాద్రి రెడ్డి, వేముల రమేష్, చింతల వెంకటేశ్వర్లు, సురేష్, సుధాకర్, ఎస్సీ సెల్ కన్వీనర్ గర్నిపూడి రమేష్, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

సమరోత్సాహంలో యువత

- పార్టీ విజయానికి పాటుపడతామన్న యువత
- మంత్రి మేరుగు నాగార్జున ఎన్నికల ప్రచారం



ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి మేరుగు నాగార్జున, ఎంపీ నందిగం సురేష్

మద్దిపాడు: రాబోయే ఎన్నికల్లో యువత సమరోత్సాహంతో ముందుకు నడుస్తోందని పార్టీకి మూల స్తంభాలు యువతే అని సంతనూలపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి, మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. మండలంలోని ఏడుగుండ్లపాడు, సీతారాంపురం, నేలటూరివారిపాలెం, లింగంగుంట, పెదకొత్తపల్లి, నేలటూరు గ్రామాల్లో ఆదివారం ఆయన ఎన్నిక ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. నేలటూరు గ్రామంలో ప్రచారానికి వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిని చేసుకోవడానికి యువత సిద్ధంగా ఉందని అన్నారు. సీఎం వైఎస్ జగన్ విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలు అవసరమని నమ్మి వాటికి ప్రథమ ప్రాధాన్యత ఇచ్చి ప్రోత్సహించారన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థలను ప్రోత్సహిస్తూ ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేసిన ఘనుడు చంద్రబాబు అన్నారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌తో భూములను కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నాడంటూ ముఖ్యమంత్రి పై అభాండాలు వేస్తూ తన పచ్చ ప్రసార సాధనాల్లో విషం చిమ్మారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో గెలవడానికి మోసపూరిత హామీలు ఇస్తున్నాడని అన్నారు. ఇంటికి ఒక చిన్నారికే అమ్మ ఒడి పథకం అమలు చేస్తే రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి శ్రీలంకలా మారుస్తున్నాడంటూ గగ్గోలు పెట్టిన ఈ పెద్ద మనిషి ఇప్పుడు తన మ్యానిఫెస్టోలో ఇంటిలో అందరికీ అమ్మకు వందనం పథకంలో రూ.15 వేలు ఇస్తాననడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. పక్క రాష్ట్రాల నుంచి, వైఎస్సార్ సీపీ నుంచి పథకాలను కాపీ కొట్టిన చంద్రబాబు తన మ్యానిఫెస్టో అంటూ చెబుతున్నాడని.. కానీ గత ఎన్నికల్లో చెప్పిన మ్యానిఫెస్టో ఏమైందో అందరికీ తెలుసని అన్నారు. ముందుగా ప్రతి గ్రామంలో యువకులు బైకులతో ర్యాలీలు నిర్వహిస్తూ మేళతాళాలతో ఊరేగింపుగా మంత్రి మేరుగు నాగార్జునను తమ గ్రామాలకు ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు మండవ అప్పారావు, పార్టీ ప్రధాన కార్యదర్శి ఎంపీటీసీ వాకా కోటిరెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చుండూరి రవి, గొర్రెపాటి శ్రీను, పార్టీ సీనియర్ నాయకులు బాలాంజనేయరెడ్డి, గుడ్డపాతల రవి, మండవ బాల చంద్రమౌళి, మేకల కృష్ణారెడ్డి, కంచి శ్రీనివాసరెడ్డి అచ్యుత్, మందా చిన్న, జనార్దన్, శ్రీకాంత్, దుంపా సుబ్బారెడ్డి ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఎంపీటీసీ సభ్యులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు యువత భారీగా పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైఎస్ జగన్‌తోనే బలిజల సంక్షేమం, అభివృద్ధి



కూనపరెడ్డి శివశంకరరావు

ఒంగోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తోనే బలిజ, తెలగ, కాపుల అభ్యున్నతి అని ఏపీ బలిజ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కూనప రెడ్డి శివశంకరరావు పేర్కొన్నారు. స్థానిక తన కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ కాపులకు 31 మందికి ఎమ్మెల్యే సీట్లు, 5 ఎంపీ సీట్లు ఇచ్చి సముచిత స్థానం కల్పించిందన్నారు. కానీ ప్రతిపక్ష కూటమి పార్టీలు అన్నీ కలిసి కూడా 23 ఎమ్మెల్యే, మూడు ఎంపీ సీట్లు ఇచ్చి చేతులు దులుపుకున్నాయన్నారు. బలిజ కాపులకు జగన్ ప్రభుత్వం చేసిన మంచి గత 60 ఏళ్లలో ఏ ప్రభుత్వం చేయలేదన్నారు. గతంలో చంద్రబాబు బలిజ కాపులకు చేసిన సాయం కేవలం రూ.1340 కోట్లు మాత్రమే అని, కానీ జగన్ ప్రభుత్వం కాపు నేస్తం పథకం ద్వారా అందించిన సాయం రూ.2029 కోట్లు అన్నారు. గత 52 నెలల్లో జగన్ ప్రభుత్వం 77 లక్షల మంది లబ్ధిదారులకు నగదు బదిలీ పథకం ద్వారా రూ.22,333 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా రూ.16,914 కోట్లు బలిజ, కాపు, తెలగ, ఒంటరి కులాలకు చేకూర్చిన మొత్తం లబ్ధి రూ.39,247 కోట్లు అని చెప్పారు. ఈ సంక్షేమం పొందిన ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ అభివృద్ధికి అండగా నిలుస్తారన్నారు.

వడదెబ్బకు వృద్ధురాలు మృతి

మద్దిపాడు: ఎండలు విపరీతంగా కాస్తున్న నేపథ్యంలో వడదెబ్బ తగిలి వృద్ధురాలు మృతిచెందిన సంఘటన మద్దిపాడు మండలంలోని తంగెళ్ల గ్రామంలో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన బయలరాజు నాగరత్తమ్మ (70) గ్రామ సమీపంలో సాగుచేసిన మిరప చేను వద్దకు వెళ్లింది. ఎండ తీవ్రత తట్టుకోలేక కళ్లుతిరిగి కిందపడిపోయింది. బంధువులు ఇంటికి తీసుకొచ్చిన కొద్దిసేపటికే మృతి చెందింది. ఆమెకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

మీ ఆశీర్వాదంతో విజయం సాధిస్తాం

- బ్రాహ్మణుల ఆత్మీయ సమావేశంలో బాలినేని శ్రీనివాసరెడ్డి, చెవిరెడ్డి భాస్కరరెడ్డి



బ్రాహ్మణుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, పక్కన చెవిరెడ్డి భాస్కరరెడ్డి, మల్లాది విష్ణు

ఒంగోలు: మీరంతా భగవంతుని ప్రతిరూపాలు.. మీ సంక్షేమమే మా లక్ష్యం, ఎల్లవేళలా మీకు అండగా ఉంటాం.. మీ ఆశీర్వాదంతో విజయం సాధిస్తాం అని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ ఒంగోలు అసెంబ్లీ అభ్యర్థి బాలినేని శ్రీనివాసరెడ్డి, ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి బ్రాహ్మణులను ఉద్దేశించి ప్రసంగించారు. ఒంగోలు నగరంలోని రంగారాయుడు చెరువు సమీపంలో గల శంకరనారాయణ కళ్యాణ మండపంలో స్థానిక 35వ డివిజన్ కార్పొరేటర్ ఆదిపూడి గిరిజా శంకర శాండిల్య అధ్యక్షతన ఆదివారం బ్రాహ్మణుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. బాలినేని, చెవిరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ 1999వ సంవత్సరం నుంచి తాను ఎన్నికల్లో పోటీ చేశానని, ఇప్పటి వరకు 5 సార్లు మీ అందరి సహకారంతో గెలిచానని, ఈసారి కూడా మీ సహకారంతో ఆరోసారి గెలిచి సిక్సర్ విజయం సాధించి ప్రజలకు మేలు చేసి రాజకీయాల నుంచి విరమించాలని ఉందని అన్నారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి శ్రీనివాస కళ్యాణం జరిపిస్తున్నానని తెలిపారు. గతంలో రాజీవ్‌కాలనీలో పేద బ్రాహ్మణులకు ఇళ్ల స్థలాలు ఇచ్చానని, ప్రస్తుతం వాటి విలువ సుమారు రూ.20 లక్షలు ఉందని గుర్తు చేశారు. జగనన్న కాలనీలో 500 మంది పేద బ్రాహ్మణులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడమే కాకుండా బ్రాహ్మణుల సంప్రదాయాలను గౌరవించి అందరికీ ఒకేచోట స్థలాలు ఇచ్చిన విషయాన్ని బాలినేని గుర్తు చేశారు. ఇంకా ఇళ్ల స్థలాలు లేని పేద బ్రాహ్మణులు ఉంటే వారికి కూడా ఇళ్ల స్థలాలు ఇస్తామని తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రాగానే మిగిలిన వారందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు ఇళ్లు కూడా కట్టించి ఇస్తానని భరోసా ఇచ్చారు. ప్రతిరోజూ ఆరుగురు బ్రాహ్మణులకు టీటీడీ బ్రేక్ దర్శనం టికెట్లు ఇస్తానని వాగ్దానం చేశారు.

ప్రస్తుత రాజకీయాలు రోత పుట్టిస్తున్నాయి...

ప్రస్తుత రాజకీయాలు రోత పుట్టిస్తున్నాయని బాలినేని ఆవేదన వ్యక్తం చేశారు. మంచి చేసినా ప్రతిపక్షాలు అందులో చెడును వెతుకుతూ పచ్చమీడియా సహకారంతో అసత్య ప్రచారం చేస్తున్నాయని అన్నారు. ఒకసారేమో తాను బ్రాహ్మణుల స్థలం కబ్జా చేశారంటారు.. మరోసారి మా అబ్బాయి ఏదో చేశాడంటూ ప్రచారం చేస్తారు.. నిరూపించడయ్యా అంటే మొహం చాటేస్తారంటూ బాలినేని అసహనం వ్యక్తం చేశారు. తాను సీఎంతో పోరాడి మరీ ఆయన సహకారంతో ఐఏఎస్ అధికారుల సమక్షంలో పేదలకు ఇళ్ల పట్టాలులిస్తే.. అవి దొంగపట్టాలంటూ టీడీపీ అభ్యర్థి తప్పుడు ప్రచారం చేయడం సమంజసం కాదన్నారు. బ్రాహ్మణుల కోసం టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహాన్ని, పీవీ నరసింహారావు విగ్రహాన్ని ఏర్పాటు చేయించానన్నారు. బ్రాహ్మణులు అబ్దికాలు పెట్టుకోవడానికి ఎన్ని ఒత్తిడులొచ్చినా స్థలం కేటాయించానని బాలినేని వివరించారు.

బ్రాహ్మణ ద్రోహి.. చంద్రబాబు : ఎమ్మెల్యే మల్లాది విష్ణు

టీడీపీ అధినేత చంద్రబాబు బ్రాహ్మణ ద్రోహి అని బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు విమర్శించారు. చంద్రబాబు బ్రాహ్మణులకు రిటైర్‌మెంట్ ప్రకటిస్తే.. జగనన్న బ్రాహ్మణులకు రిటైర్‌మెంట్ లేదని, వారు పనిచేయగలిగినంత కాలం విధుల్లో ఉండవచ్చని చెప్పారని కొనియాడారు. అర్చకుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకొచ్చారని వివరించారు. బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా చంద్రబాబు కేవలం రూ.268 కోట్లు ఖర్చుపెడితే.. జగనన్న సుమారు రూ.7,900 కోట్లు ఖర్చు పెట్టారని వివరించారు. కరోనా సమయంలో అర్చకులను ఆదుకున్న గొప్ప వ్యక్తి జగనన్న అని కొనియాడారు. బ్రాహ్మణులు రాజకీయంగా ఎదగడానికి టీడీపీ అవకాశం ఇవ్వలేదని, ఒక్క సీటు కూడా కేటాయించలేదని తెలిపారు. బ్రాహ్మణులు రాజకీయంగా ఎదగడానికి అనేక పదవులను జగనన్న ఇచ్చారన్నారు. అర్చకులను ఎవరైనా దూషిస్తే అట్రాసిటీ కేసు పెట్టేందుకు చట్టం తీసుకొస్తానని ప్రకటించిన బ్రాహ్మణ పక్షపాతి జగనన్న అని తెలిపారు. బ్రాహ్మణులంతా వైఎస్సార్ సీపీ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి బాలినేని శ్రీనివాసరెడ్డిని, చెవిరెడ్డి భాస్కరరెడ్డిని గెలిపించాలని 35వ డివిజన్ కార్పొరేటర్ శాండిల్య విజ్ఞప్తి చేశారు. అనంతరం బాలినేని, చెవిరెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, జ్వాలాపురం శ్రీకాంత్, సాయినాథశర్మ, తాడేపల్లి విజయకృష్ణ, మోటుపల్లి శ్రీనివాసాచార్యులు, ఘడియారం సుధాకరశర్మ, టి.రవికుమార్, కార్పొరేటర్లు నీలంరాజు సరోజ, సుజాత, మాజీ కార్పొరేటర్ పోలూరి జ్వాలాపతి, డాక్టర్ గంజాం శ్రీనివాసమూర్తి, బందా జవహర్, మహంకాళి శేషయ్య, మైనంపాటి సాయికుమార్, ములుకుట్ల శ్రీరామచంద్రమూర్తి, రాచకొండ శ్రీనివాసశాస్త్రి, ఉప్పుగుండూరి శ్రీనివాసరావు, మద్దులూరి హరిప్రేమనాథ్, దామరాజు క్రాంతికుమార్, కొండపి సుబ్బారావు, ఉదయకుమార్ ధన్వంతరి, చౌదరి అప్పారావు, చిలంచర్ల రామకృష్ణారావు, రుద్రవరం సాయి, నేలబొట్ల సుబ్రహ్మణ్యం, బీమ శంకరశాస్త్రి, మాధవశర్మ, తదితరులు పాల్గొన్నారు.

బాలినేనితో కలిసి ఒంగోలును అభివృద్ధి చేస్తా : చెవిరెడ్డి భాస్కరరెడ్డి

ఒంగోలులో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి బ్రాహ్మణుల కోసం ఎన్నో మంచి పనులు చేశారని వైఎస్సార్ సీపీ ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి వివరించారు. ఆయన సతీమణి శచీదేవి కూడా బ్రాహ్మణుల సంక్షేమం కోసం తన వంతు సహకారం అందిస్తున్నారని కొనియాడారు. తాను టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వెంకటేశ్వర విద్యా సంస్థలలో 6వ తరగతి నుంచి పీజీ వరకు కేవలం రూ.9,500తో విద్యాభ్యాసం పూర్తి చేశానన్నారు. ఐదు సార్లు టీటీడీ బోర్డు మెంబర్‌గా పనిచేశానని, బ్రాహ్మణులను ఎంతో గౌరవంగా చూస్తానని తెలిపారు. బాలినేనిని, తనను గెలిపిస్తే ఒంగోలును అభివృద్ధి చేస్తామని భరోసా ఇచ్చారు.



ఒంగోలులో ఆదివారం ఉదయం బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా నిర్వహించిన హోమంలో స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, శచీదేవి దంపతులు, వైఎస్సార్ సీపీ ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి, పార్టీ నాయకులు పాల్గొని పూజలు చేశారు.

జగన్ సీఎం అయితేనే ఇంటి వద్దకు పింఛన్

- ఎన్నికల ప్రచారంలో బాలినేని శచీదేవి



మహేంద్రనగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బాలినేని శచీదేవి

ఒంగోలు టౌన్: ప్రతి నెలా అవ్వాతాతలకు ఇంటి వద్దకే పింఛన్లు తెచ్చి ఇవ్వాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటేసి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సతీమణి శచీదేవి కోరారు. ఆదివారం సాయంత్రం నగరంలోని 4వ డివిజన్ మహేంద్రనగర్ వినాయకుడి గుడి వద్ద నుంచి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి జగన్ ప్రభుత్వంలో ప్రజలకు జరిగిన మేలును, ప్రతి ఇంటికీ అందిన సంక్షేమ పథకాలను వివరించారు. మరో నెల ఆగితే మళ్లీ జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, అప్పుడు అవ్వాతాతలకు ఇంటి వద్దకే వలంటీర్లు పింఛన్లు తెచ్చి ఇవ్వడం జరుగుతుందని భరోసా ఇచ్చారు. వలంటీర్ల పనులను టీడీపీ అడ్డుకోవడం వలన ప్రస్తుతం ప్రజలు ఎంతగా ఇబ్బందులు పడుతున్నారో చూస్తే అర్థమవుతుందన్నారు. కేవలం పింఛన్లే కాకుండా ప్రభుత్వం అందజేసే సంక్షేమ పథకాలన్నీ వలంటీర్లు ఇంటి వద్దకే తెచ్చి ఇవ్వడం దేశంలో ఎక్కడా జరగడం లేదన్నారు. మంచి మనసున్న నాయకుడు కనుకనే జగనన్న ప్రజల కోసం గొప్ప వ్యవస్థలను ఏర్పాటు చేసి తపిస్తున్నాడని చెప్పారు. ఒంగోలు నగరంలో నిరుపేదలకు ఇళ్లు కట్టించే పూచి తీసుకున్న బాలినేని శ్రీనివాసరెడ్డిని మీ సోదరుడిలా ఆదరించి గెలిపించాలని కోరారు. ఎంతో మంది నిరుపేదలకు సొంత నిధులతో పింఛన్లు ఇవ్వడమే కాకుండా అడిగిన వారి కల్లా సాయం చేసే మంచి మనిషిని గెలిపిస్తే మీకు కూడా మంచే జరుగుతుందన్నారు. ప్రచారంలో కార్పొరేటర్ ఎందేటి పద్మావతి, డివిజన్ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, రమణక్క, తమ్మినేని మాధవి, రేవతక్క, పార్టీ మహిళా విభాగం నగర అధ్యక్షురాలు స్వర్ణ, పురిణి సాయిదుర్గా, మైనారిటీ నాయకులు షేక్ ఖుద్దూస్, బాషా, షేక్ అజార్, ఇందేటి వెంకటరావు, పురిణి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం ఘాట్ రోడ్డులో ప్రమాదం

- రెండు ఆర్టీసీ బస్సులు ఢీకొని ప్రయాణికుడు దుర్మరణం



మృతిచెందిన రాజారావు

పెద్దదోర్నాల: ఎదురెదురుగా వచ్చిన రెండు ఆర్టీసీ బస్సులు ఢీకొని ఒక ప్రయాణికుడు మృతిచెందగా, మరో ఎనిమిది మందికి స్వల్ప గాయాలయ్యాయి. శ్రీశైలం ఘాట్ రోడ్డులో ఈ ఘటన జరగ్గా, ప్రమాదానికి గురైన బస్సులు రోడ్డుకు అడ్డంగా నిలిచిపోవడంతో సుమారు నాలుగు గంటల పాటు వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పెద్దదోర్నాల మండల పరిధిలోని తుమ్మలబైలు – చింతల గిరిజనగూడేల మధ్యలో ఆదివారం చోటుచేసుకున్న ఈ ప్రమాదంలో గుంటూరుకు చెందిన ఊట్ల రాజారావు (68) అక్కడికక్కడే మృతిచెందాడు. 108 సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని ఎనిమిది మంది క్షతగాత్రులను ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్సై అంకమరావు చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. శ్రీశైలం నుంచి మంగళగిరి వెళ్తున్న ఆర్టీసీ బస్సు, గుంటూరు నుంచి శ్రీశైలం వెళ్తున్న నరసరావుపేట డిపో ఆర్టీసీ బస్సు ఢీకొన్నట్లు తెలిపారు. వాహనాల రాకపోకలు నిలిచి 4 గంటల పాటు ఇబ్బందులు పడ్డారు.

వైఎస్సార్ సీపీకి భారీగా మద్దతు

- పార్టీలో చేరిన పలు ప్రాంతాల టీడీపీ నాయకులు
- వైఎస్సార్ సీపీ కండువాలు వేసి ఆహ్వానించిన ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, యువనేత ప్రణీత్‌రెడ్డి



ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరుతున్న శ్రీరామకాలనీ వాసులు



15వ డివిజన్‌లో వైఎస్సార్ సీపీలో చేరుతున్న టీడీపీ బూత్ ఇన్‌చార్జిలు, నాయకులు

ఒంగోలు సెంట్రల్: వైఎస్సార్ సీపీకి రోజురోజుకూ మద్దతు పెరిగిపోతోంది. ఒంగోలు నగరంలోని పలు డివిజన్ల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో వైఎస్సార్ సీపీలో చేరి మద్దతిస్తున్నారు. ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ యువనేత బాలినేని ప్రణీత్‌రెడ్డితో పార్టీ కండువాలు కప్పుకుని బాలినేని విజయం కోసం కష్టపడి పనిచేస్తామని చెబుతున్నారు.

43వ డివిజన్ నుంచి 30 కుటుంబాలు చేరిక...

నగరంలోని 43వ డివిజన్‌లో బయ్యనబోరిన బాలరాజు, వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు కండే రమణ యాదవ్ ఆధ్వర్యంలో శ్రీరామకాలనీకి చెందిన తోకరాజు, కండ్లగుంట బ్రహ్మయ్య, పల్లెబోయిన దేవరాజు, కిలారి శ్రీను, తోక వీరయ్య, తగర బుజ్జి, గుర్రపుశీల గురవయ్య, ఆళ్ల వెంకటేశ్వర్లు, తదితర 30 కుటుంబాలు టీడీపీని వీడి ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, యువనాయకుడు బాలినేని ప్రణీత్‌రెడ్డితో వైఎస్సార్ సీపీ కండువాలు వేయించుకుని ఆదివారం పార్టీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పూర్ణ ప్రభావతి, కండే వెంకటేశ్వర్లు, వద్ది శ్రీను, అణు, పాశం లక్ష్మీనారాయణ, నాలి కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

కమ్మపాలెంలో వైఎస్సార్ సీపీలోకి 20 మంది యువకులు...

ఒంగోలు కమ్మపాలెం (7వ డివిజన్) యువకులు బొల్లినేని మహేష్, బొల్లినేని గోపి ఆధ్వర్యంలో ఆదివారం 20 మంది యువకులు వైఎస్సార్ సీపీ యువ నాయకుడు బాలినేని ప్రణీత్‌రెడ్డి సమక్షంలో టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి బాలినేని నివాసంలో పార్టీ కండువాలు వేసి ప్రణీత్‌రెడ్డి ఆహ్వానించారు. దామచర్ల జనార్దన్ వ్యవహారశైలి సక్రమంగా లేదని, బాలినేని గెలుపునకు కృషి చేస్తామని పార్టీలో చేరిన వారు చెప్పారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు జఫరుల్లా, నాయకులు పెద్ద మీరా, బుజ్జి, ఆవుల సురేంద్ర, నాగూర్ మీరావలి, శ్రీకాంత్, కళ్యాణ్, అశోక్, సుల్తాన్, మస్తాన్‌వలి, బద్రి, సమీర్, విష్ణుచౌదరి, వాసు, దుర్గ, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని వీడిన బూత్ ఇన్‌చార్జి, కన్వీనర్లు...

వైఎస్సార్ సీపీ బీసీ సెల్ నగర అధ్యక్షుడు సుతారం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక 15వ డివిజన్‌కు చెందిన టీడీపీ బూత్ ఇన్‌చార్జి, కన్వీనర్లు ఎస్.నాగబ్రహ్మాచారిని, కంచర్ల హేమలత, కర్లపురం హర్ష, సుంకర ఉదయ్ కిరణ్, నాగూర్‌వలి, మరో 25 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరాయి. పార్టీ యువనేత బాలినేని ప్రణీత్‌రెడ్డి వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బాలినేని ప్రణీత్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీకి ప్రజల్లో రోజురోజుకు మద్దతు పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో క్రిష్ణబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, బీసీసెల్ నాయకుడు పిగిలి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

8వ డివిజన్‌లో వైఎస్సార్ సీపీలో చేరిన 12 కుటుంబాలు...

ఒంగోలు 8వ డివిజన్‌లో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాత్ర బంగారం ఆధ్వర్యంలో ఈతముక్కల డేవిడ్, నాగేంద్రబాబు, ఎండ్లూరి సుబ్బయ్య, మున్నంగి సురేష్, కావూరి ప్రేమ్‌కుమార్, మందా సన్నీ, ఈతముక్కల సువర్ణరాజు, నెలబొట్ల ప్రసాద్, ఈతముక్కల ఇస్మాయేల్, కొలకవారి యేసోబు, మున్నంగి భాస్కర్‌రావు, ఈతముక్కల రఘుకుమార్‌లకు చెందిన 12 కుటుంబాలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సమక్షంలో ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరాయి. వారికి పార్టీ కండువాలు కప్పి బాలినేని ఆహ్వానించారు.



బాలినేని ప్రణీత్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరిన 43వ డివిజన్ వాసులు



కమ్మపాలెంలో వైఎస్సార్ సీపీలో చేరుతున్న వారితో బాలినేని ప్రణీత్‌రెడ్డి

మామయ్య గెలిస్తేనే ఒంగోలు అభివృద్ధి

- ఎమ్మెల్యే బాలినేని కోడలు శ్రీకావ్య
- ఒంగోలు 25వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం



ఒంగోలు 25వ డివిజన్ గంటాపాలెంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న బాలినేని శ్రీకావ్య

ఒంగోలు: తన మామయ్య, ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ ఒంగోలు అసెంబ్లీ అభ్యర్థి బాలినేని శ్రీనివాసరెడ్డిని అఖండ మెజారిటీతో గెలిపించి ఒంగోలు అభివృద్ధికి సహకరించాలని, ఆయన ఆరోసారి గెలిచి సిక్సర్ విజయం సాధించేందుకు అవకాశం ఇవ్వాలని బాలినేని కోడలు, ప్రణీత్‌రెడ్డి సతీమణి శ్రీకావ్య ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం నగరంలోని 25వ డివిజన్‌లో ఆమె పర్యటించారు. ఇంటింటికి తిరిగి అభివృద్ధి, సంక్షేమంపై కరపత్రాలు అందించారు. ఈ సందర్భంగా శ్రీకావ్య మాట్లాడుతూ 25వ డివిజన్‌లో బాలినేని సహకారంతో ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయని, ఇంకా అభివృద్ధి జరగాలంటే బాలినేనిని మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ నెల 13వ తేదీ జరిగే సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో ఒంగోలు ఎమ్మెల్యేగా బాలినేని శ్రీనివాసరెడ్డిని, ఎంపీగా చెవిరెడ్డి భాస్కరరెడ్డిని గెలిపించేందుకు వైఎస్సార్ సీపీ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఒడా చైర్‌పర్సన్ శింగరాజు మీనాకుమారి, డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ(బుజ్జి), దాసరి నారాయణరావు, పార్టీ డివిజన్ అధ్యక్షుడు పట్నం మధుసూదన్‌రావు, పి.సుజాత, షేక్ తుల్లి, శివ, తిరుపతి, ఘంటా రామ్మోహన్‌రావు, త్రిపురం, టి.మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

మారం వెంకారెడ్డి సేవలు అభినందనీయం

- వెంకారెడ్డి మాతృమూర్తి చిన్నమ్మకు నివాళులర్పించిన మంత్రి మేరుగు



మారం చిన్నమ్మకు నివాళులర్పిస్తున్న మంత్రి మేరుగు నాగార్జున, మారం వెంకారెడ్డి

చీమకుర్తి: తల్లిదండ్రుల జ్ఞాపకార్థం వైఎస్సార్ సీపీ అద్దంకి పరిశీలకుడు మారం వెంకారెడ్డి చేస్తున్న సేవలు అభినందనీయమని వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి మేరుగు నాగార్జున కొనియాడారు. వెంకారెడ్డి మాతృమూర్తి మారం చిన్నమ్మ వర్ధంతి సందర్భంగా ఆదివారం చీమకుర్తిలోని వెంకారెడ్డి నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి మేరుగు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి ఏటా తల్లిదండ్రుల జయంతులు, వర్ధంతులను పురస్కరించుకుని పేదలకు సేవ చేయడం ప్రశంసనీయమన్నారు. తొలుత మారం చిన్నమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రానున్న ఎన్నికలలో తనను సంతనూతలపాడు ఎమ్మెల్యేగా గెలిపించటంలో సహాయ సహకారాలు అందించాలని మారం వెంకారెడ్డిని మంత్రి మేరుగు నాగార్జున కోరారు. మారం వెంకారెడ్డి దంపతులు మేరుగు నాగార్జునను శాలువాతో ఆప్యాయంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేగా గెలిపించేందుకు తమ వంతు సహకారం ఉంటుందని మారం వెంకారెడ్డి తెలిపారు. అనంతరం వెంకారెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్ బీ జవహర్ ఆస్పత్రి, ప్రభుత్వాస్పత్రులలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, చీమకుర్తి పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, రూరల్ కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, మాజీ జెడ్పీటీసీ గోగినేని వెంకటేశ్వర్లు, గంగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, డాక్టర్ బీ జవహర్, కౌన్సిలర్లు సోమా శేషాద్రి, గంగిరెడ్డి సుందరరామిరెడ్డి, పాటిబండ్ల గంగయ్య, షేక్ ఖాదర్‌బాషా, పేరం శ్రీనివాసరావు, బడే అయ్యపరెడ్డి, పోకూరి రామకృష్ణారెడ్డి, బడే దశరథరామిరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఫ్యాన్‌కు ఓటేయండి

- వైఎస్సార్ సీపీ యువనేత బాలినేని ప్రణీత్‌రెడ్డి



కె.పల్లెపాలెంలో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరుతున్న నాయకులతో బాలినేని ప్రణీత్‌రెడ్డి

కొత్తపట్నం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గత ఐదేళ్లుగా చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఒంగోలు ఎమ్మెల్యేగా బాలినేని శ్రీనివాసరెడ్డిని, ఎంపీగా చెవిరెడ్డి భాస్కరరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ యువనేత బాలినేని ప్రణీత్‌రెడ్డి కోరారు. ఆదివారం రాత్రి కొత్తపట్నం మండలంలోని ఈతముక్కల, వజ్జిరెడ్డిపాలెం, కె.పల్లెపాలెం గ్రామాల్లో ఆయన పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వజ్జిరెడ్డిపాలెంలో బైక్ ర్యాలీ నిర్వహించి ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అక్కడి యువ నాయకులతో కొద్దిసేపు మాట్లాడారు. ఈతముక్కల గ్రామంలో ముస్లింకాలనీ, బందెళ్లదొడ్డి యానాది కాలనీ, గౌడకాలనీ, పార్కు సెంటర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం కె.పల్లెపాలెంలో యువనాయకులతో మాట్లాడారు. అందరూ కలిసికట్టుగా పనిచేసి పల్లెపాలెంలో మెజార్టీ తీసుకురావాలని కోరారు. ఏ సమస్య ఉన్నా తాను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కె.పల్లెపాలెం గ్రామంలో 20 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరగా, వారికి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు సైకం లక్ష్మీశారద, సర్పంచ్‌లు విశ్వనాథపల్లి ఆనంద్‌రావు, మేడికొండ సునీత, జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి, మాజీ సర్పంచ్ దాచూరి గోపాల్‌రెడ్డి, తాత నాంచార్లు, తాత శ్రీను, సుబ్రహ్మణ్యం, కొక్కిలగడ్డ నాంచార్లు తదితరులు పాల్గొన్నారు.

"రాజశేఖరరెడ్డి పాలన చూశాం. ఆయన కొడుకు జగన్ పేదోళ్ల గురించి అంతకు మించి ఆలోచన చేస్తున్నాడు. చంటి పిల్లల దగ్గర నుంచి పండు ముసలోళ్ల వరకు ఏదో ఒక పథకం జేబా జిక్కికి అందించాడు. కరోనా వచ్చినపుడు దేశమంతా జనం పిట్టల్లా రాలిపోతున్నా మన దగ్గర ఆస్పత్రుల్లో బాగా చూసుకున్నారు. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు చాలా బాగున్నాయ్.."

ఇదీ 70 కిలో మీటర్ల మేర సాగిన 'సాక్షి రోడ్ షో'లో ఓటర్ల హృదయ స్పందన. సంక్షేమ పథకాలు అందించడంలో వైఎస్ జగన్‌ను ఢీకొట్టాలంటే అటు వైపు కూడా జగనే ఉండాలన్న అభిప్రాయం ప్రజల నుంచి వ్యక్తమైంది. – ఎన్.మాధవరెడ్డి, సాక్షి ప్రతినిధి, ఒంగోలు


పెద ఉల్లగల్లు వద్ద ఆర్‌బీకే, గ్రామ సచివాలయం, విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్లు

సుపరిపాలనకే ఓటు

- చంద్రబాబు పచ్చి మోసగాడు
- 14 ఏళ్ల పాలనలో పేదలకు చేసిందేమీ లేదు
- మళ్లీ జగన్ వస్తేనే రాష్ట్రానికి మంచి జరుగుతంది
- ఒంగోలు, సంతనూతలపాడు, దర్శి నియోజకవర్గాల పల్లెల్లో ఓటర్ల మనోగతం

సమయం ఉదయం 9 గంటలకు అప్పటికే సూర్యుడు సుర్రు మంటున్నాడు. మా ప్రయాణం మొదలైంది. ఒంగోలు రూరల్ మండలంలోని త్రోవగుంట, చేకూరపాడు, ఏడుగుండ్లపాడు మీదుగా సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గంలోని మద్దిపాడు మండల కేంద్రానికి చేరుకున్నాం. అక్కడ ఇద్దరు యువకులు విద్య కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు బాగున్నాయని, నాడు-నేడు కింద స్కూళ్లలో అన్ని వసతులు సమకూరాయంటూ చెప్పుకొచ్చారు. సచివాలయాలు ఏర్పాటు చేయడంతో ఇంతకు ముందులా మండల కేంద్రాలు, డివిజన్ కేంద్రాలకు వెళ్లాల్సిన బాధ తప్పిందని ప్రభుత్వ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.

చాలా సంతోషంగా ఉందయ్యా..


అంజలి, ఆమె నిర్వహిస్తున్న దుకాణం

వెల్లంపల్లి మీదుగా కొలచనకోట పల్లెకు వెళ్తున్న క్రమంలో రోడ్డు పక్కనే చిన్న కిరాణా కొట్టు వద్ద ఓ వృద్ధురాలు, వివాహిత, ఇద్దరు చిన్నారులు కూర్చుని ఉన్నారు. దుకాణం నిర్వాహకురాలు జగన్నాథం అంజలి ప్రభుత్వం నుంచి తనకు కలిగిన మేలును వివరించింది. "అమ్మఒడి పథకం డబ్బుతో పిల్లల్ని చదివిస్తున్నా. డ్వాక్రా గ్రూపు రుణ మాఫీ డబ్బులు బ్యాంకులో పడ్డాయి. సున్నా వడ్డీ డబ్బులు కూడా వచ్చాయి. గ్రూపు సభ్యులమంతా కలిసి మళ్లీ రూ.20 లక్షలు లోన్ తీసుకున్నాం. నా వాటా కింద వచ్చిన రూ.2 లక్షలతో ఇదిగో ఈ చిల్లరకొట్టు పెట్టుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నా" అంటూ సంతోషంగా చెప్పింది.



ఆ పక్కనే ఉన్న వృద్ధురాలు కొలచనకోట ఆదిలక్ష్మి మాట్లాడుతూ.. "మా ఆయన అంజయ్యకు పింఛను వస్తోంది. నాకు చేయూత డబ్బులు వచ్చాయి. మా కూతురు వలంటీర్‌గా చేస్తోంది. జగనన్న ఇళ్లు కూడా ఇచ్చారు" అని ఆనందంగా చెప్పుకొచ్చింది. "తెలుగుదేశపోళ్లు అడ్డుకోవడంతో వలంటీర్లను ఆపార"ని ఆదిలక్ష్మి చెబుతుండగా చంద్రబాబు పది వేలు ఇస్తానంటున్నాడు కదా అని అంటే "నోటి మాటే కదా.. నేను కూడా చాలా చెబుతాను" అంటూ దెప్పిపొడిచింది.



అక్కడ నుంచి కాస్త దూరంలో ఉన్న మరో వృద్ధురాలు మస్తానమ్మను కదిలిస్తే.. "పింఛను, చేయూత, డ్వాక్రా రుణమాఫీ, జగనన్న ఇళ్లు వచ్చాయి. ఎంత మంది కలిసినా మళ్లీ వచ్చేది జగనే" అంటూ రెట్టించిన ఉత్సాహంతో చెప్పింది.

మేమంతా టీడీపీనే.. మాకు మేలు జరిగింది

టీడీపీకి కాస్త పట్టున్న దొడ్డవరంలో ప్రభుత్వ పనితీరుపై జనాభిప్రాయం తెలుసుకునేందుకు ప్రయత్నించాం. ఊరి నడిబొడ్డున గుడి వద్ద కూర్చుని ఉన్న ఇద్దరు వ్యక్తులతో మాటలు కలిపాం. "మా ఊర్లో తెలుగుదేశం వారే ఎక్కువ. మేమూ తెలుగుదేశమే. మా పిల్లలు చదువుకున్నారు. ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నారు. నాకు పింఛను వస్తోంది. మా పిల్లల్లో ఒకరు వలంటీర్‌గా చేస్తున్నారు. కుటుంబం సాఫీగా నడుస్తోంది. ఏ పార్టీ అయితేనేమి నాకు మేలు జరిగింది. ఆ కృతజ్ఞత అలాగే ఉంటుంది" అని ముక్తాయించారు పేరు చెప్పడానికి ఇష్టపడని ఒక పెద్దాయన.

ఆర్యవైశ్యులకు జగన్ మేలు చేశారు



సమయం ఉదయం 11.15 గంటలు.. దర్శి నియోజకవర్గంలోని తాళ్లూరు మండల కేంద్రం.. రోడ్డు పక్కనున్న కిరాణా షాప్ నిర్వాహకుడు చందా శ్రీనివాసరావుతో మాట కలిపాం. "జగన్ ప్రభుత్వంలో ఆర్య వైశ్యులకు ఎంతో మంచి జరిగింది. కిరాణా కొట్లలో గంజాయి అమ్ముతున్నామని చంద్రబాబు మాట్లాడటం దారుణం. ఎంతో కాలంగా చింతామణి నాటకంలో సుబ్బిశెట్టి పాత్రను తొలగించాలని చంద్రబాబును కోరాం. ఆయన పట్టించుకోలేదు. జగన్‌ను అడిగిన వెంటనే మా కోరిక తీర్చారు. ప్రభుత్వం ద్వారా రైతు భరోసా వస్తోంది. నా భార్యకు చేయూత పథకం డబ్బులు వచ్చాయి" అని ఆనందంగా చెప్పారు.

బాబు మాటలు నమ్మి మోసపోయాం



తాళ్లూరు హైస్కూలు ఆవరణలో చెట్టు కింద ఉన్న ఇద్దరు రైతులను జగన్ పాలనపై ప్రశ్నించగా "సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల ద్వారా మాలాంటి రైతులకు మేలు జరిగింది. చంద్రబాబు 2014లో 600 హామీలు ఇచ్చాడు. రైతు రుణమాఫీని నమ్మి బ్యాంకులకు డబ్బులు కట్టలేదు. ఆ తర్వాత అసలు, వడ్డీలు కలిపి కట్టలేక యాతనపడ్డాం" అని చెప్పుకొచ్చారు. మళ్లీ ముఖ్యమంత్రి జగనే అవుతాడని రైతు లోకిరెడ్డి సుబ్బారెడ్డి అభిప్రాయపడ్డారు.

ప్రాణం పోయినా అభిమానం చెక్కుచెదరదు



దొడ్డవరం ఆలయ పరిసరాల్లో సుమారు 50 ఏళ్ల వయసున్న పోకూరి ధనలక్ష్మి సీఎం వైఎస్ జగన్ చేసిన మంచిని చెబుతూనే తన వెంట రమ్మని ఆహ్వానించింది. పక్క వీధిలో తాను ఉంటున్న ఇంటికి తీసుకెళ్లి "ఇది మహానుబావుడు రాజశేఖరరెడ్డి ఇచ్చాడు. ఆయన కొడుకు జగన్ పథకాలు ఇచ్చాడు. ప్రాణం పోయినా మా అభిమానం చెక్కుచెదరదు. మా ఊరంతా తెలుగుదేశమే అయినా మేము జగన్ వెంటే. పవన్, షర్మిల, చంద్రబాబు ఎవరొచ్చినా జగన్ సీఎం" అని కుండ బద్దలు కొట్టినట్టు చెప్పింది.

బాబు కుర్చీ ఎక్కితే సినిమా చూపిస్తాడు



సమయం మధ్యాహ్నం 12.45.. ముండ్లమూరు మండలం వేంపాడు గ్రామం.. స్థానిక యువకుడు గణేష్‌తో మాటలు కలిపాం. 2014 నుంచి 2019 వరకు రైతులు చాలా ఇబ్బందులు పడ్డారు. మళ్లీ ఆ పరిస్థితి రాకూడదని కోరుకుంటున్నా. మార్చి నెల వరకు మా నాన్నతోపాటు ముసలి ముతకా అందరికీ ఒకటో తేదీన వలంటీర్లు వచ్చి పింఛను ఇచ్చేవారు. చంద్రబాబు చేసిన పనికి రెండు నెలలుగా ఎన్ని ఇబ్బందులు పడుతున్నారో కళ్లారా చూస్తున్నాం. బాబు అధికారంలో లేకపోయినా జనాలను హింసిస్తున్నాడంటే.. ఇక కుర్చీ ఎక్కితే సినిమా చూపిస్తాడు' అని ఒకింత ఆవేశంగా మాట్లాడాడు. పక్కనున్న యువకులు కూడా గణేశ్‌కు జత కలిసి చంద్రబాబు తీరును ఎండగట్టారు.

ఆరోగ్య శ్రీలో స్టంట్ వేశారు



దర్శి ప్రధాన కూడలి వద్ద రోడ్డు పక్కనే ఉన్న వెంకటయ్య అనే వ్యక్తిని జగన్ పరిపాలన ఎలా ఉందని ప్రశ్నించగా.. 'నాకు వైఎస్సార్ హయాంలో గుండె జబ్బు వస్తే ఆరోగ్య శ్రీలో ఉచితంగా స్టంట్ వేశారు. నా భార్యకు కిడ్నీ సమస్య వచ్చింది. ఉచితంగా డయాలసిస్ చేయిస్తున్నారు. నెలకు రూ.10 వేలు పింఛను ఇస్తున్నారు. నాకు కొద్ది నెలల క్రితం మళ్లీ గుండె సమస్య వచ్చింది. ఆరోగ్య శ్రీ ద్వారానే స్టంట్ వేశారు. ఆస్పత్రి నుంచి ఇంటికెళ్లేటపుడు ప్రభుత్వం డబ్బులు ఇచ్చింది. ఉచితంగా మందులు ఇస్తోంది. ఆ మారాజు జగనే మళ్లీ రావాలి' అంటూ కృతజ్ఞత చాటారు.

నా బిడ్డకు ఉచితంగా గుండె ఆపరేషన్ చేశారు



కూలీ పనిచేసుకొని జీవనం సాగించే నాకు పెద్ద కష్టం వచ్చి పడింది(కన్నీళ్లు పెట్టుకుంటూ). నాకు ఇద్దరు కుమారులకు గుండెలో రంధ్రాలు పడ్డాయని డాక్టర్లు చెప్పారు. వైద్యం చేయించడయ్యా అని టీడీపీ ప్రభుత్వంలో అధికారుల చుట్టూ, నాయకుల చుట్టూ, ఆస్పత్రుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగా. ఎవరూ పట్టించుకోలేదు. జగనన్న సీఎం అయ్యాక ఆరోగ్య శ్రీలో మా పెద్దబ్బాయికి గుండె ఆపరేషన్ చేశారు. చిన్నబ్బాయికి కూడా త్వరలోనే ఆపరేషన్ చేస్తామని చెప్పారు.

– నాసర బాబు, కురిచేడు

టీడీపీ పాలనలో చాలా అన్యాయం చేశారు



సాక్షి బృందం చివరగా కురిచేడు మండలం ఆవులమంద గ్రామానికి చేరుకుంది. అక్కడ చెట్టు కింద కూర్చుని ఉన్న గొట్టిపాటి రాములును జగన్, చంద్రబాబు పాలనపై అభిప్రాయం కోరగా.. "తెలుగుదేశం ప్రభుత్వంలో నా తండ్రి పేరున ఉన్న పొలాలను ఆన్‌లైన్ చేసి పాస్ పుస్తకాలు ఇవ్వాలని ఎమ్మార్వో ఆఫీస్ చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా పట్టించుకోలేదు. జలసిరి కింద బోరు మంజూరైన డీప్ బోరును 100 అడుగులు వేసిన తర్వాత టీడీపీ నాయకులు వచ్చి అన్యాయంగా అడ్డుకున్నారు. జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత వైఎస్సార్ జలకళ కింద డీప్ బోరు వేయించుకున్నా. మా పిల్లలకు అమ్మ ఒడి, నా భార్యకు ఆసరా డబ్బులు అందాయి. జగనన్న ప్రభుత్వంలో రేషన్ షాపు, ఇంటి పట్టా వచ్చాయి. సొంత ఇల్లు కట్టుకోవడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నా" అని వివరించారు.


దర్శి నుంచి కురిచేడు వెళ్లే మార్గంలో నూతన సీసీ రోడ్డు


కురిచేడు మార్గంలో పొలాల్లో వేసిన నూతన విద్యుత్ లైన్లు

పబ్లిక్ వాయిస్

బాబుది ముమ్మాటికీ నిరాదరణే..



2014లో చంద్రబాబు ఆదరణ పథకం పెట్టి బీసీలకు చేసిన మోసం ఇంకా గుర్తుంది. చేతి వృత్తుదారులకు పరికరాలు ఇస్తామంటే కొనకనమిట్ల మండలంలో 500 మందికిపైగా పైగా దరఖాస్తు చేసుకున్నాం. నేను నాదస్వరం కోసం రూ.950 డీడీ కట్టా. మార్కాపురం పిలిపించి నాసిరకం నాదస్వరాన్ని చేతిలో పెట్టారు. పీకలు ఊదితే శబ్దం రావడం లేదని అక్కడే ఉన్న అధికారులకు చెబితే ×మేమేమి చేయలేం. ప్రభుత్వం సరఫరా చేసినవే మేము ఇస్తున్నాం× అని అన్నారు. అనవసరంగా రూ.2 వేలకు పైగా ఖర్చు చేయించారు. మళ్లీ ఇప్పుడు బీసీలకు అది చేస్తా ఇది చేస్తా అంటే ఎలా నమ్మాలి?

– వెంకటేశ్వర్లు, కొనకనమిట్ల

వృద్ధులను దగా చేసేలా టీడీపీ తీరు



చంద్రబాబు సూపర్ సిక్స్ హామీల్లో వృద్ధులకు 4 వేల పింఛను ఇస్తామన్న విషయాన్ని అప్పుడే ఎత్తేశారని విన్నా. ఆరా తీస్తే అది నిజమేనని తేలింది. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు పింఛను కోసం నానా తిప్పలు పడ్డాం. జన్మభూమి కమిటీవాళ్లు చెబితేనే ఆనాడు పింఛను ఇచ్చారు. జగన్ వచ్చాక ఒకటో తారీఖున వలంటీర్ ఇంటికొచ్చి పింఛను ఇవ్వడం బాగుంది. వలంటీర్లను పనిచేయన్వికుండా చంద్రబాబు అడ్డుకోవడంతో రెండు నెలల నుంచి ఇబ్బందులు పడ్డాం. ఇంకోనెలా ఇబ్బంది తప్పదని తెలుసు. జగన్ మళ్లీ వస్తేనే మాకు ఈ బాధలన్నీ తప్పుతాయి.

– కవలకుంట్ల చిన్న యేసేబు, కొండేపల్లి, మార్కాపురం మండలం

టీడీపీ పాలనలో బీసీలకు అవమానం



బీసీలపై చంద్రబాబు వ్యవహారం ఏరు దాటాక బోడి మల్లన్న చందంగా ఉంటుంది. బీసీలను ఓటు బ్యాంకుగా ఉపయోగించుకోవడం, ఆ తర్వాత కులం పేరుతో, వృత్తి పేరుతో అవమానించడం బాబుకు అలవాటే. బీసీ డిక్లరేషన్ పేరుతో చంద్రబాబు అరచేతిలో స్వర్గం చూపిస్తున్నారు. పోలింగ్ అయిన మరునాడే మరిచిపోతారు. సమస్యలు చెప్పుకునేందుకు వెళ్లిన నాయీబ్రాహ్మణుల తోకలు కత్తిరిస్తానని హెచ్చరించడం, కుల వృత్తుల వారిని అవమానించిన విషయం ఎలా మర్చిపోగలం. జగనన్న అధికారంలోకి వచ్చిన తరువాత బీసీలకు ఎనలేని గౌరవాన్ని ఇచ్చారు. కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, పదవుల్లో రిజర్వేషన్లు అమలు చేసి ఆత్మస్థైర్యాన్ని పెంచారు. బ్యాక్‌బోన్ క్లాస్ అంటూ బీసీల అభ్యున్నతికి పాటుపడ్డారు.

– జూపల్లి ఏడుకొండలు, పొదిలి

బాబు చెప్పే హామీలు అసాధ్యం



టీడీపీ మేనిఫెస్టోను ప్రజలు నమ్మే పరిస్థితి లేదు. గతంలో ఇచ్చిన హామీలను గాలికొదిలేసిన చంద్రబాబు తిరిగి ఈ ఎన్నికల్లోనూ అలివికాని హామీలు గుప్పించారు. చంద్రబాబు చెప్పేవన్నీ అమలు చేయాలంటే 1.70 లక్షల కోట్ల రూపాయలు అవసరమని చెబుతున్నారు. అంత ఆర్థిక భారం భరించే స్థోమత రాష్ట్రానికి లేదని బాబుకు తెలిసినా ఓట్ల కోసం అబద్ధాలు చెబుతున్నారు. ఆయన మాటలు నమ్మేందుకు ప్రజలు సిద్ధంగా లేరు. ఈ ఎన్నికల్లోనూ టీడీపీ తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు.

– సుబ్రహ్మణ్యం, అంబేద్కర్ కాలనీ, త్రిపురాంతకం

సంక్షేమంలో ఛాలెంజ్



మార్కాపురం: దివ్యాంగులు ఎందులోనూ తక్కువ కాదు. అవయవ లోపం వారి ప్రతిభకు అడ్డు కానే కాదు. వివక్ష చూపడం, అవహేళనగా మాట్లాడటం మాని సమానంగా చూడటం సామాజిక బాధ్యత. కానీ ప్రభుత్వాలే దివ్యాంగులను నిర్లక్ష్యం చేస్తే సమాజం మరింత చిన్న చూపు చూస్తుంది. దివ్యాంగుల విషయంలో గత ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని గుర్తించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారి సంక్షేమానికి చేపట్టిన చర్యలు సత్ఫలితాలనిచ్చాయి. దివ్యాంగుల్లో మరింత ఆత్మస్థైర్యం నింపాయి. రేపటిపై ఆశతో, భవిష్యత్‌పై భరోసాతో సమస్యలను 'ఛాలెంజ్' చేస్తూ దివ్యాంగులు ముందుకు సాగుతున్నారు.

• • •

నాడు దురవస్థ

గత టీడీపీ ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి, వారిలో ఆత్మ స్థైర్యాన్ని దెబ్బతీసింది. పింఛను ఎప్పుడిస్తారో తెలియదు. సదరం క్యాంపుల్లో సర్టిఫికెట్లు అందక, వారికి కావాల్సిన ప్రత్యేక ఉపకరణాలు లభించక దివ్యాంగులు పడిన అవస్థలు అన్నీ ఇన్నీ కావు. ఏదైనా పథకం కోసం దరఖాస్తు చేసుకుని మంజూరు కావాలంటే ఉత్తర(రెకమెండేషన్ లెటర్), దక్షిణాలు (మామూళ్లు) సమర్పించుకున్నా నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరగాల్సిన దుస్థితి. అయినా పథకాలు అందాయా అంటే అదీ లేదు.

నేడు ఆత్మస్థైర్యం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం పెంపొందించేలా గతంలో 3 శాతంగా ఉన్న రిజర్వేషన్‌ను 4 శాతానికి పెంచారు. గతంలో బస్‌పాసుల కాల పరిమితి ఏడాది కాగా మూడేళ్లకు పెంచారు. జగనన్న హౌసింగ్ స్కీమ్‌లో దివ్యాంగులకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారు. క్రమం తప్పకుండా సదరం క్యాంపులు నిర్వహిస్తూ సర్టిఫికెట్లు మంజూరు చేస్తున్నారు. దివ్యాంగుల కోరిక మేరకు పర్సంటేజీని బట్టి పింఛను ఇచ్చే విధానాన్ని రద్దు చేశారు. పక్షవాతం ఉన్న దివ్యాంగులకు రూ.5 వేలు, పూర్తిగా మంచానికే పరిమితమైన దివ్యాంగులకు 10 వేలు పింఛను అందించడంతో వారికి ఆర్థిక భరోసా దక్కినట్టయింది. జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మూడు చక్రాల వాహనాలు, ఇతర ఉపకరణాలు అందజేశారు. జిల్లాలో 32 దివ్యాంగ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయడంతోపాటు అర్హులైన వారికి సబ్సిడీపై రుణాలు మంజూరు చేసి జీవితంలో నిలదొక్కుకునేలా చేశారు.


దివ్యాంగునికి వీల్‌చైర్, వాకర్ అందిస్తున్న గోపాల్‌రెడ్డి(ఫైల్)

దివ్యాంగులకు డిజిటల్ విద్య

విద్యారంగంలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చిన రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగ విద్యార్థులకు సైతం డిజిటల్ విద్యను చేరువ చేసింది. జిల్లాలో 38 భవిత కేంద్రాల్లో సుమారు 800 మంది విద్యార్థులు నమోదై ఉన్నారు. వీరిలో 380 మంది వరకు ఇంటి వద్దనే ఉంటూ ఐఈఆర్‌టీల ద్వారా శిక్షణ పొందుతున్నారు. దృష్టిలోపం, నోవిజన్, మూగ, చెవుడు కలిగిన ఉన్నత పాఠశాలల విద్యార్థులు సుమారు 296 మందికి, ఐఈఆర్‌టీలు 75, స్కూల్ అసిస్టెంట్‌లకు (స్పెషల్ బీఈడీ చేసిన ఉపాధ్యాయులు) 43 ట్యాబ్‌లను ప్రభుత్వం పంపిణీ చేసింది. ఎన్‌ఈపీ 2020లో భాగంగా దివ్యాంగ విద్యార్థులకు అందించిన ఒక్కో ట్యాబ్ విలువ సుమారు రూ.30 నుంచి రూ.35 వేల వరకు ఉంటుంది. ఇన్‌క్లూసివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ టీచర్స్ (ఐఈఆర్‌టీ), దివ్యాంగుల తల్లిదండ్రులకు ట్యాబ్‌ల వినియోగంపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.

పింఛను పెంపుతో సంతోషం

జిల్లాలో 36,310 మంది దివ్యాంగులకు వివిధ రకాల పింఛన్లు అందిస్తున్నారు. వీరిలో రూ.3 వేలు పింఛను తీసుకుంటున్న దివ్యాంగులు 33,205 మంది, రూ.5 వేలు పింఛను తీసుకుంటున్న దివ్యాంగులు (డీఎంహెచ్‌ఓ పరిధి) 2,540 మంది, రూ.10 వేలు పింఛను తీసుకుంటున్న దివ్యాంగులు 565 మంది ఉన్నారు. సీఎం వైఎస్ జగన్ పింఛను పెంచడంపై దివ్యాంగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దివ్యాంగులకు అన్ని విధాలా మేలు



దివ్యాంగుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అందించిన సహకారం మర్చిపోలేం. రిజర్వేషన్‌ను 3 నుంచి 4 శాతానికి పెంచడంతోపాటు ఉపకరణాలు కూడా అందించారు. పింఛను నగదు, బస్‌పాసుల కాలపరిమితి పెంచారు. దివ్యాంగులను సకలాంగులు వివాహం చేసుకుంటే మ్యారేజ్ ఇన్సెంటివ్ అవార్డు కింద గతంలో ఇస్తున్న రూ.లక్షను రూ.1.50 లక్షలకు పెంచారు. ప్రభుత్వం ఏర్పాటు కాగానే పింఛను నగదును రూ.3 వేలు చేశారు. ఇలా అన్ని విధాలుగా దివ్యాంగులకు మేలు చేకూరింది.

– డి.గోపాల్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు, మార్కాపురం

సంక్షేమ లబ్ధి ఇలా..

ఉపకరణాలు	లబ్ధిదారుల సంఖ్య	మొత్తం
3 చక్రాల మోటారు వాహనాలు	80	రూ.96 లక్షలు
ట్రై సైకిళ్లు	548	రూ.35.62 లక్షలు
బ్యాటరీ ట్రై సైకిళ్లు	72	రూ.33.84 లక్షలు
టచ్ ఫోన్లు	387	రూ.58.05 లక్షలు
బ్లైండ్ స్టిక్స్	131	రూ.26,200
హియరింగ్ మిషన్లు	10	రూ.2,500
వాకింగ్ స్టిక్స్	200	రూ.33,600
వీల్‌చైర్లు	135	రూ.1.08 లక్షలు

ట్యాబ్‌ల పంపిణీ ఇలా...

జిల్లాలో భవిత కేంద్రాలు:	38
నమోదైన చిన్నారులు:	800
ఇంటి వద్దనే ఐఈఆర్‌టీల ద్వారా శిక్షణ పొందుతున్నవారు:	380 మంది
ట్యాబ్‌లు అందుకున్న విద్యార్థులు	296
ఐఈఆర్టీలకు ఇచ్చిన ట్యాబ్‌లు	75
స్కూల్ అసిస్టెంట్లకు (ప్రత్యేక బీఈడీ టీచర్లు)	43
హెచ్.ఐ (7–10 తరగతుల విద్యార్థులకు)	155
వీ.ఐ (5–10 తరగతుల విద్యార్థులకు)	36